

‘పట్నాన్ని’ గెలిచిన వీరులు

ఇబ్రహీంపట్నం పేరు వింటేనే తెలంగాణ సాయుధ పోరాటం గుర్తుకు వస్తుంది.

10లో▸



కారెక్కిన ‘దండెం’

కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం టికెట్ ఆశించి భంగపడిన దండెం .. కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

10లో▸



మినీ భారత్.. షాద్‌నగర్

రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండటం, పరిశ్రమల ఏర్పాటుతో షాద్‌నగర్ నియోజకవర్గం మినీ భారత్‌గా మారింది.

10లో▸

న్యూస్‌రీల్

పట్టు రైతులను ఆదుకోవాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శుక్రునాయక్

తలకొండపల్లి: పట్టుపురుగుల పెంపకందారులకు తగిన ప్రోత్సాహం ఇచ్చి ఆదుకోవాలని పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శుక్రునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని కోరింతకుంట తండాలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత 4 సంవత్సరాలుగా పట్టు షెడ్లకు రావాల్సిన ప్రోత్సాహకం రావడం లేదని.. వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే కిలో పట్టుగూళ్లకు రూ.600 మద్దతు ధర అందించాలని కోరారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పట్టుగూళ్లు అమ్మిన రోజునే రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్నారని.. తెలంగాణలోని హైదరాబాద్ తిరుమలగిరి మార్కెట్‌లో ఆ విధంగా డబ్బులు జమకావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర, కర్ణాటక మాదిరిగానే తెలంగాణాలోనూ అమ్మిన రోజునే డబ్బుల జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సబ్సిడీపై డ్రిప్పులను అందజేయాలని కోరారు. ప్రభుత్వ పరంగా పట్టు షెడ్లకు సబ్సిడీ అందించాలని కోరారు. తిరుమలగిరి మార్కెట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి నూతన అధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పట్టు రైతులు.. మల్లేశ్, నరేష్, యాదగిరి, వినోద్, దస్రు, జంగయ్య, శంకర్, దేవ్యా, గోవింద్, ప్రకాశ్, నర్సింహ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం: కేఎల్ఆర్



కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సత్యనారాయణ

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) స్పష్టం చేశారు. మండల పరిధిలోని కోళ్లపడకల్‌కి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణతో పాటు పలువురు గురువారం కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి సబితారెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి, డబ్బుల కోసం కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిందన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి సబితారెడ్డిని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, సీనియర్ నాయకులు యాదయ్య, నర్సింహ, ప్రవీణ్, యాదయ్య, ప్రశాంత్‌రెడ్డి, చంద్రమోహన్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

30 ప్లస్సే కీలకం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలిచేందుకు 30–39 ఏళ్ల మధ్య వయసున్న వారి ఓట్లే కీలకంగా మారనున్నాయి. జిల్లాలో మొత్తం ఓటర్లు 45,36,852 మంది. వీరిలో 13,87,744 మంది 30–39 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం గమనార్హం. అంటే 30.58 శాతం ఓటర్లు ఈ ఏజ్ గ్రూప్‌లోని వారే . వీరిలో ఎక్కువమంది ఎవరికి ఓట్లు వేస్తే వారు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. 30–39 ఏజ్ గ్రూప్‌లో లక్ష మంది కంటే ఎక్కువ ఓటర్లున్న నియోజకవర్గాల్లో నాంపల్లి, కార్వాన్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా నియోజకవర్గాలు ఉన్నాయి.


వాహన తనిఖీల్లో రూ.8.40 లక్షలు స్వాధీనం

యాలాల: మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చెక్‌పోస్టు వద్ద గురువారం యాలాల పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఓ కారులో తరలిస్తున్న రూ.8.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

గుర్తులొచ్చాయ్..

పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

- జిల్లా బరిలో నిలిచిన 209 మంది అభ్యర్థులు
- కొన్ని నియోజకవర్గాల్లో బ్యాలెట్ సామర్థ్యానికి మించి కేండెట్లు
- అదనపు బ్యాలెట్లను వినియోగించనున్న ఈసీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన జాతీయ, రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీలతో పాటు, స్వతంత్ర అభ్యర్థులకు.. ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మొత్తం 280 నామినేషన్లు దాఖలు కాగా.. తిరస్కరణ, ఉపసంహరణ తర్వాత ప్రస్తుతం 209 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఎంఐఎం, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలకు చెందిన అభ్యర్థులు సుమారు యాభై మంది ఉండగా.. మిగిలినవారిలో స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందినవారు ఉన్నారు. వీరంతా ఆయా పార్టీల గుర్తులపై తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల బ్యాలెట్ యూనిట్ సామర్థ్యానికి మించి అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నికల కమిషన్ ఆయా స్థానాల్లో అదనపు బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేసింది. అయితే బ్యాలెట్ యూనిట్‌పైఒకే గుర్తును పోలిన మరికొన్ని గుర్తులు కూడా ఉండటంతో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై అభ్యర్థులు కూడా ఆందోళన చెందుతున్నారు.

గుర్తుల కేటాయింపు..

ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించింది. వీరిలో బీఆర్ఎస్ (కారు),కాంగ్రెస్(హస్తం), బీజేపీ (కమలం పువ్వు), బీఎస్పీ (ఏనుగు), సీపీఎం (సుత్తి కొడవలి), సీపీఐ (కంకి కొడవలి), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (సింహం), ఎంఐఎం (పతంగి), ధర్మస్వరాజ్ పార్టీ (టార్చ్‌లైట్), ఆల్ ఇండియా సమతా పార్టీ (పలక), విద్యార్థుల రాజకీయ పార్టీ (బ్యాట్), జనశంఖారావం పార్టీ (బెండకాయలు), తెలంగాణ జాగీర్ పార్టీ (టీవీ రిమోట్), భారత చైతన్య యువజన పార్టీ (రైతు, వరికంకులు), బ్లూ ఇండియా పార్టీ (మిక్సీ), జన రాజ్యం పార్టీ(కంప్యూటర్), భారతీయ క్రాంతిసంఘ్ (వజ్రం), సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా (పెట్రోల్ పంపు), తెలంగాణ రిపబ్లిక్ పార్టీ (మైకు), నవరంగ్ కాంగ్రెస్ పార్టీ (కుండ), ఇండియా ప్రజా కాంగ్రెస్ (ఐస్‌క్రీం), ఇండియా ప్రజా బంధు పార్టీ (ట్రంపెట్), ప్రజా ఏక్తా పార్టీ (కుక్కర్), బహుజన లెఫ్ట్ పార్టీ (కత్తెర), ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ (బెలూన్), అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ ఫార్వర్డ్ పార్టీ (చపాతీపీట), రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(గాలిగొట్టం), తెలంగాణ రాజ్య సమితి (గ్యాస్ సిలిండర్), యుగ తులసి పార్టీ (రోడ్డు రోలర్), పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా (పిల్లన గ్రోవి) గుర్తులను కేటాయించింది. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థులకు గ్యాస్‌సిలిండర్, ఎయిర్ కూలర్, రోడ్డు రోలర్, విజిల్, బాల్‌బ్యాట్, ల్యాప్‌టాప్, హార్మోనియం, చెయిన్, క్రేన్, యాపిల్, రింగ్, బకెట్, బాల్, స్టైతస్కోప్, పడవ, చెప్పుల జత, కుట్టుమిషన్, లైటర్, కెమెరా, క్యారంబోర్డు, డంబెల్స్, ఇసుర్రాయి, హాకీ బ్యాట్, అగ్గిపెట్టె, గ్యాస్‌స్టవ్, సీసీ కెమెరా, బేబీ వాకర్, గ్లాసు, చేతిగాజులు, బీరువా, ప్రెజర్ కుక్కర్, పెన్‌డ్రైవ్ తదితర గుర్తులను ఎన్నికల సంఘం కేటాయించింది.సాధారణంగా ఓటర్లకు ప్రధాన పార్టీలు, వాటి గుర్తులు, పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రమే తెలిసి ఉంటుంది. అయితే ఈసారి ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి సుమారు 12 నుంచి 48 మంది వరకు పోటీలో నిలివడంతో అభ్యర్థులతో పాటు వారికి కేటాయించిన గుర్తులను గుర్తించడం ఓటర్లకు ఇబ్బందిగా మారింది.

ఓటర్లు, అభ్యర్థుల వివరాలు

మొత్తం నియోజకవర్గాలు	8
పోలింగ్ బూత్‌లు	3,369
మొత్తం ఓటర్లు	35,22,420
పురుషులు	18,22,366
మహిళలు	16,99,600
థర్డ్ జెండర్స్	454
ఎన్ఆర్ఐలు	207
సర్వీస్ ఓటర్లు	592
దాఖలైన నామినేషన్లు	280
తిరస్కరణకు గురైనవి	31
ఉపసంహరించుకున్నవి	40
బరిలో ఉన్న అభ్యర్థులు	209

బ్యాలెట్ సామర్థ్యానికి మించి అభ్యర్థులు

సాధారణంగా ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16మంది అభ్యర్థుల పేర్లు, వారి ఫొటోలు, ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తులను నమోదు చేసే అవకాశం ఉంది. కానీ ఒక్కో నియోజకవర్గంలో బ్యాలెట్ యూనిట్ సామర్థ్యానికి మించి అభ్యర్థులు పోటీలో ఉండటంతో ఒక్కో పోలింగ్ బూత్‌లో రెండు యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన పరస్థితి. అత్యధికంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో 48 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక్కడ మొత్తం 570 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఒక్కో కేంద్రంలో మూడు యూనిట్ల చొప్పున మొత్తం 1,710 మెషీన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. అదే విధంగా ఇబ్రహీంపట్నంలో 28 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక్కడ 319 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఒక్కో కేంద్రంలో రెండు యూనిట్ల చొప్పున 638 మెషీన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఇక మహేశ్వరం నుంచి 27 మంది పోటీ పడుతున్నారు. ఇక్కడ మొత్తం 511 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో రెండు చొప్పున మొత్తం 1,022 యూనిట్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. రాజేంద్రనగర్‌లో 25 మంది అభ్యర్థులు పోటీపడుతుండగా.. 355 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో రెండు చొప్పున మొత్తం 710 యూనిట్లు అవసరమవుతున్నాయి. అదే విధంగా కల్వకుర్తి నుంచి 24 మంది పోటీపడుతుండగా.. 262 పోలింగ్ కేంద్రాల్లో 524 యూనిట్లు, షాద్‌నగర్ నుంచి 14మంది పోటీ పడుతుండగా.. 252 యూనిట్లు, చేవెళ్ల నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. 298 బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేయాల్సి వస్తుంది.



అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి

మాట నిలబెట్టుకున్నాం

- 111 జీఓ ఎత్తివేతతో భూముల ధరలకు రెక్కలు
- మొయినాబాద్ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

మొయినాబాద్: గత ఎన్నికల్లో 111 జీఓను ఎత్తేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. అయితే కొంతమంది రాజకీయ స్వార్థం కోసం 111 జీఓపై కోర్టులను ఆశ్రయించారని.. వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని మంత్రి కేటీఆర్అన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా గురువారం మొయినాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షో కేటీఆర్ మాట్లాడారు. శంకర్‌పల్లిలో కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది, షాబాద్ మండలం చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో మరిన్ని ఫ్యాక్టరీలు రాబోతున్నాయన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషిచేశారని తెలిపారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి ఆయుధాలు సరఫరా చేసే కేసులో దొరికిపోయిన వ్యక్తి అని ఆరోపించారు. ఆయుధాలు సరఫరా చేసేవాళ్లు కావాలా..? గంగిగోవులాంటి కాలె యాదయ్య కావాలా ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.111 జీఓ ఎత్తివేతతో ఈ ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెలికాప్టర్‌లో వచ్చిన మంత్రి

రోడ్‌షో కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్ హెలికాప్టర్‌లో వచ్చారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీహెచ్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది. అప్పటికే అక్కడికి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. అనుకున్న సమయం కంటే గంటన్నర ఆలస్యంగా కేటీఆర్ మొయినాబాద్‌కు చేరుకున్నారు. హెలికాప్టర్ వద్ద కేటీఆర్‌కు ఎమ్మెల్యే యాదయ్య, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల రవియాదవ్, అఖిల భారత రాష్ట్ర యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు రవి, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యవర్గ సభ్యుడు అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సీనియర్ నేత ఈగ రవీందర్‌రెడ్డి తదితరులు నిలువెత్తు పూలబొకేతో ఘనం స్వాగతం పలికారు. అనంతరం రోడ్‌షోలో మంత్రి పాల్గొన్నారు. రోడ్‌షో కారణంగా మొయినాబాద్ మీదుగా వెళ్లాల్సిన వాహనాలను దారి మళ్లించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

20% రిజర్వు సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి భారతి హోళికేరి
- పోలింగ్ సిబ్బందితో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హోళికేరీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బందితో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు,ఐఏఎస్ చంద్రకాంత్ కృష్ణారావు, ఐఏఎస్‌లు.. రామ్‌కుమార్,శిల్పగుప్తాపర్యవేక్షించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఇప్పటికే వీరికి పలు విడతలుగా ఎంపిక చేసిన కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామని కలెక్టర్ వివరించారు. అదే విధంగా జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 3,369 పోలింగ్ కేంద్రాలుండగా.. పోలింగ్ విధుల కోసం సిబ్బందిని నియమించినట్లు..దీంతోపాటు 20శాతం రిజర్వు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బృందంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలీసు సిబ్బంది కూడా ఉంటారని, ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా 5 పోలింగ్ కేంద్రాల చొప్పున.. మహిళా బృందం, ఒక దివ్యాంగుల బృందం, యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపికచేశామన్నారు. అనంతరం మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, నోడల్‌అధికారి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మాసిటీతో యువతకు ఉద్యోగాలు

- భూబాధితులకు అండగా ఉంటా
- తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు
- రోడ్‌షోలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే మంచిరెడ్డి తకిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

యాచారం: ప్రపంచస్థాయి కంపెనీలతో యాచారం మండలం భవిష్యత్‌లో ఎంతో పేరు సాధిస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో ఆయన మాట్లాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి గ్రామీణ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశాను.. రూ. వందలాది కోట్ల నిధులతో ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు, కాలనీల్లో సీసీ రోడ్లు వేయించాను. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్థానిక యవతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టీఎస్ఐఐసీ నిధులతో ఫార్మాసిటీకి భూములిచ్చిన గ్రామాల్లోని కాలనీల్లో సీసీరోడ్లు వేయించినట్లు తెలిపారు. ఫార్మాసిటీలో అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని వెల్లడించారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి..

తాడిపర్తి గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న తాటికుంట మైసమ్మ దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మైసమ్మ తల్లి దీవెనలతోనే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాన్నన్నారు. కొత్తపల్లిలో బొక్కల కంపెనీ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతుంటే వెంటనే అసెంబ్లీలో మాట్లాడి ఆ కంపెనీని మూసేయించినట్లు తెలిపారు. రూ.5 కోట్ల నిధులతో కొత్తపల్లి–కొత్తపల్లి తండా, కొత్తపల్లి–కిషన్‌పల్లి గ్రామాల మీదుగా బీటీ రోడ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కారుగుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, సర్పంచ్‌లు రవికిరణ్ రెడ్డి, శివలీల, జగదీష్, హబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో మహేశ్వరం అభివృద్ధి



మహేశ్వరం: ప్రచార రథంపై సబితారెడ్డి, నాయకులు

- మరోమారు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో మరోమారు తానే ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని మంత్రి సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దాదాపు రూ.100 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనేక పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇప్పించామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ, బీఆర్ఎస్ నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కార్యదర్శి అంజయ్య, మండల అధ్యక్షుడు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు లావణ్య, కళావతి, అనితానాయక్, కవిత, ఎంపీటీసీ రమేష్, కుమారి రాయప్ప, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కొడుతున్నాం

తుక్కుగూడ: బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలకి చెందిన సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో తనపై పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో అనిల్, సదానంద్, సుధాకర్, తిరుమలేష్, అనిల్, సురేష్, రమేష్, శివప్రసాద్, ధనుష్, పాండు, రామస్వామి, మనీష్, నర్సింహ, సురేందర్, మురళి, శివలింగం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కారెక్కిన కాంగ్రెస్ నేత 'దండెం'



రాంరెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం టికెట్ ఆశించి భంగపడిన దండెం రాంరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సమక్షంలో గురువారం గులాబీ కండువా కప్పుకున్నారు. అయనతో పాటు ఆ పార్టీ నాయకు లు రాహుల్, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్ శ్రీను, సత్యనారాయణ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఇబ్రహీంపట్నం బరిలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా దండెం నామినేషన్ వేసి ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

గుర్తించని 'హస్తం'

20 సంవత్సరాలుగా పార్టీకి అనేక సేవలు చేశానని, అయినా కాంగ్రెస్ గుర్తించలేదని దండెం వాపోయారు. ఇబ్రహీంపట్నం టికెట్ ఇస్తానని నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ తన సేవలను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించిందని, మంత్రి కేటీఆర్ తనకిచ్చిన హామీతో ఆ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. మంచిరెడ్డి విజయానికి పాటుపడతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు దెబ్బ..

గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లేశ్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరి కిషన్‌రెడ్డి గెలుపునకు కారకుడయ్యారు. ఇప్పుడు ఇదే నియోజకవర్గానికి చెందిన దండెం రాంరెడ్డి.. కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పుడు కూడా మంచిరెడ్డే బరిలో ఉన్నారు. ఆయన గెలుపునకు దండెం చేరిక ఎంతవరకు ప్రభావితం చేస్తుందో వేచిచూడాలి.

'పట్నాన్ని' గెలిచిన వీరులు

- 16 సార్లు ఎన్నికలు.. 10 మంది ప్రాతినిథ్యం
- హ్యాట్రిక్ సాధించిన లక్ష్మీనర్సయ్య
- చరిత్రను మంచిరెడ్డి తిరగస్తారా?

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పేరు వింటేనే తెలంగాణ సాయుధ పోరాటం గుర్తుకు వస్తుంది. అందుకే ఈ గడ్డను పోరాటాల గడ్డగా కీర్తిస్తుంటారు. ఈ నియోజకవర్గానికి మరో చరిత్ర కూడా ఉంది. ఇక్కడి నుంచి శాసనసభకు పోటీ చేసి, హ్యాట్రిక్ సాధించిన అభ్యర్థులు కూడా ఉన్నారు. పట్నం బరితో నిలిచి ముచ్చటగా మూడు దఫాలు విజయం సాధించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి.. నాలుగోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన గెలిస్తే మరో చరిత్రను లిఖించడం ఖాయం.

ద్విసభ్య నియోజకవర్గం..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం 1952లో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇక్కడి నుంచి 10 మంది ప్రజాప్రతినిధులు ప్రాతినిథ్యం వహించారు. మొదటి సారి ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఓటర్లు ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్, పీడీఎఫ్ నుంచి పాపిరెడ్డిని గెలిపించారు. ఆరంభం నుంచి 1983 వరకు కాంగ్రెస్‌కు పట్నం కంచుకోటగా ఉంది. అయితే 1983లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హవా కొనసాగింది. ఇలాంటి సమయంలో కూడా పట్నం ఓటర్లు హస్తం పార్టీకే పట్టం కట్టారు. అయితే అనూహ్యంగా ఆ పార్టీకి 1985 ఎన్నికల్లో చెక్ పెట్టారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొండ్రు పుష్పలీల ఎమ్మెల్యేగా గెలిచి.. ఎన్టీఆర్ కేబినెట్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు.

హ్యాట్రిక్ వీరులు వీరే..

1957, 1962, 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మూడు సార్లు లక్ష్మీనర్సయ్య విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా.., 2018లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించారు. మహేశ్వరం, కందుకూరు, యాచారం, మంచాల మండలాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఉండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, యాచారం, మంచాల, మండలాలతో అసెంబ్లీ స్థానం ఏర్పాటైంది. హయత్‌నగర్ మండలాన్ని విభజించి కొత్తగా అబ్దుల్లాపూర్‌మెట్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయంజాల్, పెద్దంబర్‌పేట్‌లను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు.



ఇబ్రహీంపట్నంలో విజేతలు వీరే..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952 (ద్విసభ్య)	ఎంబీగౌతమ్	కాంగ్రెస్
1952 (ద్విసభ్య)	పాపిరెడ్డి	పీడీఎఫ్
1957	ఎంఎన్ లక్ష్మీ నర్సయ్య	కాంగ్రెస్
1962	ఎంఎన్ లక్ష్మీ నర్సయ్య	కాంగ్రెస్
1967	ఎంఎన్ లక్ష్మీ నర్సయ్య	కాంగ్రెస్
1972	ఎన్.అనంతరెడ్డి	కాంగ్రెస్
1978	సుమిత్రాదేవి	కాంగ్రెస్
1981	ఏజీ కృష్ణా	కాంగ్రెస్
1983	ఏజీ కృష్ణా	కాంగ్రెస్
1985	కె.సత్యనారయణ	టీడీపీ
1989	కొండిగారి రాములు	సీపీఎం
1994	కొండిగారి రాములు	సీపీఎం
1999	కొండ్రు పుష్పలీల	టీడీపీ
2004	మస్కు నర్సింహ	సీపీఎం
2009	మంచిరెడ్డి కిషన్ రెడ్డి	టీడీపీ
2014	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	టీడీపీ
2018	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	టీఆర్‌ఎస్

హస్తం గూటికి 'డబ్బికార్'



శ్రీనివాస్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తెలంగాణ ఉద్యమకారుడు, ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డబ్బికార్ శ్రీనివాస్ గురువారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. డబ్బికార్‌తో పాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు బర్ల జగదీశ్వర్, ఇందిరాల రమేష్, గాజుల గోపాల్‌ను.. పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నియంత పోకడ వలనే ఉద్యమకారులకు గుర్తింపులేకుండా పోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య, మచ్చ లక్ష్మణ్ ఉన్నారు.

మేడ్చల్ గులాబీకి షాక్

కాంగ్రెస్‌లోకి ఐదుగురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

బోడుప్పల్: బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి చామకూర మల్లారెడ్డికి షాకిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం వీరు హస్తం గూటికి చేరారు. వీరిలో బింగి జంగయ్య యాదవ్, దానగల్ల అనిత, జడిగె మహేందర్ యాదవ్, రాసాల వెంకటేశ్ యాదవ్, గుర్రాల రమా ఉన్నారు. నిన్నా మొన్నటి దాకా మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్లు ఒక్కసారిగా కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఊహించని పరిణామం. వీరి చేరికతో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా.. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన రాజకీయ పలుకుబడి, చతురతతో బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని దెబ్బతీసేలా పావులు కదుపుతున్నారు. తన పాత మిత్రులైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపు కోసం ఆయన వ్యూహాలు రచిస్తున్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఇందిరాపార్కు ఎన్‌టీఆర్ స్టేడియంలో తలపెట్టిన కోటి దీపోత్సవం మూడవ రోజు గురువారం రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, హర్యానా గవర్నర్లు అబ్దుల్ నజీర్, బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. నగరం నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి (కాశీ జగద్గురు), శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామి (తపోవనం, తుని) అనుగ్రహ భాషణం చేయగా డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి ప్రవచణామృతం వినిపించారు.

కార్మికుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

పరారీలో నిందితుడు

మణికొండ: పనిచేస్తున్న ప్రదేశంలో ఇద్దరు కార్మికుల మధ్య చెలరేగిన వివాదం హత్యకు దారితీసింది. తలపై ఇనుప రాడ్‌తో కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన నయన్ పహారియా(24), రూబెల్ షేక్‌లు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రెస్టేజ్ నిర్మాణ సంస్థలో కార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రతి రోజు మాదిరిగానే గురువారం ఇద్దరూ 10వ అంతస్తులో పనిచేస్తున్నారు. అదే క్రమంలో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి వివాదంగా మారింది. ఈ క్రమంలో రూబెల్ షేక్ పక్కనే ఉన్న రాడ్‌తో నయన్ పహారియాను తలపై బలంగా కొట్టగా.. తల పగిలి తీవ్ర రక్తస్రావం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 100కు ఫోన్ చేసి విషయం చెప్పటంతో విషయం నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే పేరు.. గుర్తే వేరు!

లక్డీకాపూల్/చైతన్యపురి: ఎన్నికలు జరిగినప్పుడల్లా ఒకే పేరు కలిగిన వేర్వేరు అభ్యర్థులు పోటీ చేయడం పరిపాటి. ఈసారి గ్రేటర్‌లో కొన్ని నియోజకవర్గాల్లో అలాంటి సమస్య ఉంది. ఎన్నికల ప్రచారం సంగతి ఎలా ఉన్నా ఓటు వేయడానికి వెళ్లినప్పుడు ఒకే పేరుతో ఇద్దరు ఉండడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతుంటారు. అలా ఒకే పేరు కలిగిన అభ్యర్థులు పోటీ పడుతున్న నియోజకవర్గాల్లో కొన్ని గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. ఎల్బీనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, డి.సుధీర్ రెడ్డిలు తలపడుతున్నారు. గోషామహల్‌లో వ్యాసల బెడద నెలకొంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ కాగా శుభం వ్యాస్, సందీప్ వ్యాస్‌లు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఉప్పల్ నుంచి బండారి లక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాగా ఏడీఆర్ పార్టీ అభ్యర్థిగా మన్నె లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. ముషీరాబాద్‌లో ముఠా గోపాల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవగా.. ఎం. గోపాల్ ఏఐహెచ్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అలాగే.. సనత్‌నగర్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాగా ఉప్పలపాటి శ్రీనివాస్ యుగ తులసి అభ్యర్థిగా బరిలో నిలిచారు. రాజేంద్రనగర్‌లో తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ అభ్యర్థి కాగా కె. శ్రీనివాస్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాగా కె.కిషన్ రెడ్డి ఏడీఆర్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థిగా కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కాగా అదే పేరుతో ఉన్న కె. లక్ష్మారెడ్డి జన శంఖారావం పార్టీ అభ్యర్థిగా.. ఇదే నియోజకవర్గం నుంచి మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాగా ఎం. సబిత స్వతంత్ర అభ్యర్థిగా తలపడుతుండటం గమనార్హం.

ఎమ్మెల్యేలకు నిరసన సెగ



యాచారం: కుర్మిద్దలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారాన్ని అడ్డుకుంటున్న ఫార్మా భూ బాధితులు

- మంచిరెడ్డి, మహేశ్‌రెడ్డిని అడ్డుకున్న ప్రజలు
- హామీలు నెరవేర్చలేదని మండిపాటు

పరిగి/యాచారం: బీఆర్‌ఎస్ ప్రచారంలో ఎమ్మెల్యేలకు నిరసన సెగ తగిలింది. యాచారంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పరిగిలో కొప్పుల మహేశ్‌రెడ్డి వాహనాలను ప్రజలు అడ్డుకున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎందుకు వచ్చారని మండిపడ్డారు. కుర్మిద్దలో ప్రచారానికి వెళ్లిన కిషన్‌రెడ్డిపై ఫార్మాసిటీ బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్మా పేరుతో తమ భూములు లాక్కున్నారని, ఇవ్వని వారి భూములను ధరణి రికార్డుల నుంచి తొలగించి, టీఎస్ఐఐసీ పేరున మార్చారని వాపోయారు. దీంతో తాము మూడేళ్లుగా రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలకు నోచుకోవడం లేదన్నారు. పరిస్థితి అదుపుతప్పేలా ఉండటంతో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు వేయకుండా ఎందుకొచ్చావ్?

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే తమ గ్రామానికి ఎందుకు వచ్చావని పూడూరు మండలం మైసమ్మగడ్డతండా ప్రజలు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని నిలదీశారు. తమ గ్రామంలో ప్రచారం చేయడం అవసరం లేదని తేల్చిచెప్పారు. గతంలో రోడ్డు వేయమని.. నీ దగ్గరికి వస్తే ప్రభుత్వ పథకాలు వదులుకుంటే వేస్తామని చెప్పావు.. మరి ఇప్పుడెందుకు వచ్చావు అని మండిపడ్డారు. ఐదేళ్లయినా తమ గ్రామానికి ఒక్క పథకం కూడా అందలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇండ్లు ఇయ్యలే.. రోడ్డు వేయలేదని మహిళలు విరుచుకుపడ్డారు. ఈ దృశ్యాలను వీడియో తీస్తున్న స్థానిక యువకులను ఎమ్మెల్యే గన్‌మెన్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దోమ మండలంలోనూ మహేశ్‌రెడ్డి ప్రచారానికి నిరసనకారులు అడ్డుతగిలారు. పూడూరు మండల పరిధిలోని మిట్టకంకల్‌లో ఎమ్మెల్యే సంబంధీకులను ప్రచారం చేయనీయలేదు.



పరిగి: పూడూరులో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని అడ్డుకున్న తండా వాసులు

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు అజయ్ నాయక్, దీపక్ మిశ్రా

వికారాబాద్ అర్బన్: పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ సెంటర్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు అజయ్ వి.నాయక్(ఐఏఎస్), దీపక్ మిశ్రా(ఐపీఎస్) ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనకు గురువారం వారు వికారాబాద్‌కు వచ్చారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం అజయ్ నాయక్, దీపక్ మిశ్రా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై ఆరా తీశారు. కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించరాదని ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారులు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, విజయ్ కుమారి, శ్రీనివాస రావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జెడ్పీ సీఓ జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమైన అజయ్ నాయక్, దీపక్ మిశ్రా

మినీ భారత్.. షాద్‌నగర్

- ఐదేళ్లలో 47వేల మంది కొత్త ఓటర్లు
- భారీగా పెరిగిన సంఖ్య
- కీలకంగా మారనున్న యువత

షాద్‌నగర్: షాద్‌నగర్ నియోజకవర్గం మినీ భారత్‌గా మారింది. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండటం, ఇక్కడ చాలా పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది ఉపాధి కోసం వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. దీంతో ఈ ప్రాంతం మినీ భారత్‌గా పేరుగాంచింది. ఐదేళ్లలో ఇక్కడ ఓటర్లు కూడా భారీగా పెరిగారు.

ఇదీ ఓటర్ల జాబితా

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. అదే విధంగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి అయింది. నియోజకవర్గంలో మొత్తం 255 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఇక ఓటరు జాబితా పరిశీలిస్తే.. పురుషులు 1,19,045 మంది, మహిళలు 1,17,278 మంది, ఇతరులు 15 మంది ఉండగా.. మొత్తం 2,36,338 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు

నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతో పాటుగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. 2018 ఎన్నికల్లో మొత్తం 1,89,055 మంది ఓటర్లు ఉండగా.. 47,283 పెరిగి, 2,36,338 సంఖ్యకు చేరుకుంది. పోలింగ్ కేంద్రాలు 242 ఉండగా.. ప్రస్తుతం 255కు పెరిగింది.

యువత ఓట్లే కీలకం

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో యువత ఓట్లు కీలకంగా మారనున్నాయి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు అధికంగా ఉన్నారు. 19 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు సుమారు 1లక్షా 30వేలకు పైగా ఉన్నారు. అంటే ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో సగానికి కంటే ఎక్కువగా యువ ఓటర్లు గమనార్హం. అంతే కాకుండా ఉపాధి కోసం వలస వచ్చి ఓటు హక్కు పొందిన వారు సుమారు పదివేల వరకు ఉండటంతో.. అన్ని పార్టీలు వారిని లక్ష్యంగా చేసుకొని ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నాయి.



నవయువ ఓటర్లకు సపరేటు

లాలాపేట: ఓటింగ్ శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు, నూతన పద్ధతులు అవలంబిస్తోంది. ఇందులో భాగంగానే కొత్తగా ఓటు హక్కు పొందిన నవయువ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను 'స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్' పేరుతో ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొత్తం 224 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని 210వ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 750కి పైగా ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే అయోమయానికి గురికాకుండా అక్కడ నియమించిన రిసెప్షనిస్టులు ఆహ్వానం పలుకుతూ గైడ్ చేస్తారు.